సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 4 । అక్టోబర్ । 2025



కిలో టమాట రూ.25
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టంగా రూ.14 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 900 టన్నుల టమాట వచ్చింది.



టీడీపీ నేత అరాచకం
రామగిరిలో ఓ టీడీపీ నేత అరాచకానికి తెగబడ్డాడు. తన పొలంలో గొర్రెలు మేశాయంటూ కాపరిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. 10లో

గరిష్టం/కనిష్టం
34.7°/21.3°

జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వీరభద్రుని సేవలో కలెక్టర్, ఎస్పీ



కలెక్టర్ దంపతులను సన్మానిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

లేపాక్షి: దసరా పండుగ సందర్భంగా గురువారం కలెక్టర్ శ్యాంప్రసాద్ దంపతులు, ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు లేపాక్షి వీరభద్రుని సేవలో గడిపారు. ఉదయం ఎస్పీ, సాయంత్రం కలెక్టర్ దంపతులు ఆలయానికి విచ్చేయగా, ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆలయంలోని దుర్గాదేవి అమ్మవారికి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులను అడిగి ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. వారి వెంట ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, హిందూపురం రూరల్ సీఐ జనార్దన్, ఎస్ఐ మునీర్ అహమ్మద్, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లలో పలువురికి చోటు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లలో జిల్లాకు చెందిన పలువురికి చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) మెంబర్లుగా మడకశిర నియోజకవర్గానికి చెందిన హెచ్‌బీ నర్సేగౌడ, వైటీ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ ఎం.తిప్పేస్వామిలను నియమించారు. స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్లుగా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, కదిరి నియోజకవర్గానికి చెందిన అత్తార్ చాంద్‌బాషా, బత్తల హరిప్రసాద్‌కు అవకాశం కల్పించారు.

జయంత్యుత్సవాలకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా భక్తుల రద్దీ దృష్ట్యా ఉమ్మడి అనంతపురం జిల్లా మీదుగా ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లు నడపనున్నట్లు డివిజన్ అధికారులు తెలిపారు. అందులో భాగంగా యశ్వంతపూర్–హిందూపురం (06518/19) ప్యాసింజరును ఈ నెల 20 నుంచి 26 వరకు గుంతకల్లు జంక్షన్ వరకు పొడిగించినట్లు తెలిపారు. అలాగే బెంగళూరు–ధర్మవరం మధ్య మరో ప్యాసింజర్ రైలు (06595/96) ఈ నెల 20 నుంచి 26 వరకు నడపనున్నట్లు వెల్లడించారు.

పిల్లలకు పాఠాలు చెప్పి పరీక్షలు నిర్వహించే టీచర్లే... ఇప్పుడు పరీక్షకు సిద్ధం కావాల్సిన పరిస్థితి నెలకొంది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో 'టెట్' రాయకుండా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులంతా తాజాగా టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) రాయాల్సిందే. అదీ రెండేళ్లలోపే ఉత్తీర్ణత సాధించాలన్న నిబంధనతో వారంతా ఆందోళన చెందుతున్నారు. కూటమి సర్కార్ మాత్రం దీనిపై ఉలుకూపలుకూ లేకుండా ఉంది.



టీచర్లకు టెట్ టెన్షన్..!

2,078
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు

8,307
ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయుల సంఖ్య

3,500 మంది
సుప్రీం తీర్పుతో 'టెట్' రాయాల్సిన టీచర్లు (సుమారు)

కలవరపెడుతున్న సుప్రీంకోర్టు తీర్పు
- రెండేళ్లలో టెట్ పాస్ కాకపోతే ఇంటికే
- సీనియర్ ఉపాధ్యాయుల్లోనూ ఆందోళన
- తీర్పుపై పునరాలోచించాలని ఉపాధ్యాయుల విజ్ఞప్తి
- సుప్రీం తీర్పుపై నేటికీ స్పందించని కూటమి సర్కార్

కదిరి: విద్యారంగంలో సంస్కరణల పేరుతో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏ రాష్ట్రంలో లేని విధంగా 1 నుంచి 10వ తరగతి వరకూ 9 రకాల బడులను తీసుకొచ్చింది. పలు రకాల యాప్‌లతో టీచర్లను మానసిక ఒత్తిడికి గురిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతోనే ఇబ్బందులు పడుతున్న టీచర్లపై ఇప్పుడు 'టెట్' (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) బండ పడింది. 2010కి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు ఇప్పుడు 'టెట్' రాసి అర్హత సాధించాలని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతో వారిలో ఆందోళన మొదలైంది. అయితే ఏళ్లుగా విద్యార్థులకు బోధిస్తున్న తమకు ఇప్పుడు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ నిర్వహించడం ఏమిటంటూ ఉపాధ్యాయ సంఘాలు నాయకులు అంటున్నారు.

పదోన్నతులకూ 'టెట్'తో లింకు

సుప్రీం తీర్పు నేపథ్యంలో ఐదేళ్లకు పైబడి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు రెండేళ్లలోపు 'టెట్' రాసి ఉత్తీర్ణులు కావాలి. లేకపోతే ఉద్యోగం వదులుకోవాల్సిందేనా..? అనే టెన్షన్ టీచర్లను వెంటాడుతోంది. ఇక 'టెట్' పాస్ కాని వారికి పదోన్నతులు కూడా ఉండవని సుప్రీం తీర్పులో పేర్కొంది. ఐదేళ్లలోపు సర్వీసు మిగిలి ఉన్న ఉపాధ్యాయులకు 'టెట్' నుంచి మినహాయింపు ఇచ్చినప్పటికీ... వారికి పదోన్నతులు రావాలంటే 'టెట్' ఉత్తీర్ణత తప్పనిసరి. టెట్ అర్హత పరీక్షకు సంబంధించి 2010 ఆగస్టు 23న నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ)కీలక నోటిఫికేషన్ జారీ చేసింది. ఉపాధ్యాయ నియామకానికి 'టెట్' ఉత్తీర్ణత తప్పనిసరిగా పేర్కొంది. జీఓ జారీలో ముందు పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చింది. కానీ సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఇప్పుడు వారు కూడా (ఐదేళ్లు పైబడి సర్వీసు ఉన్న వారు) టెట్ రాయాల్సిన పరిస్థితి తలెత్తడంతో ఆందోళన మొదలైంది. 2012 తర్వాత టీచర్ వృత్తిలో చేరిన వారు ఇప్పటికే 'టెట్' పాస్ అయిన విషయం తెలిసిందే.

కష్టమైన పరీక్షే

ఎప్పుడో ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులు ఇప్పుడు 'టెట్' పాస్ కావాలంటే కాస్త కష్టమే. ఈ పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలంటే ఓసీ కేటగిరీ వారు 60 శాతం, బీసీలు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్, ఎక్స్ సర్వీస్ మెన్ కేటగిరీ వారు 40 శాతం మార్కులు సాధించాలి. అయితే టెట్ పేపర్–1 పాస్ కావాలంటే చైల్డ్ డెవలప్‌మెంట్, తెలుగు, ఆంగ్లం, గణితం, పర్యావరణానికి సంబంధించిన అంశాలన్నీ చదవాలి. పేపర్–2లో కూడా అదే పరిస్థితి. బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు గణితం, తెలుగు పండితులకు సోషల్ స్టడీస్, ఇలా సంబంధం లేని సబ్జెక్టులు 'టెట్'లో పెట్టి పాస్ కావాల్సిందే..అంటే ఎలా? అని టీచర్లు మండిపడుతున్నారు. అందుకే తమకు ప్రత్యేక 'టెట్' నిర్వహించాలని కొందరు, ఎప్పటి నుంచో ఉద్యోగం చేస్తున్న తమకు 'టెట్' అవసరమే లేదని ఇంకొందరు భిన్న అభిప్రాయాలు వ్యక్త పరుస్తున్నారు.

స్పందించని కూటమి

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 2,078 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1,27,104 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, 8,307 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. సుప్రీంకోర్టు టెట్‌పై ఇటీవల ఇచ్చిన తీర్పు ప్రకారం సుమారు 3,500 మంది దాకా ఉపాధ్యాయులు 'టెట్' పాస్ కావాల్సిందే. లేని పక్షంలో వారంతా తమ ఉద్యోగాలు కోల్పోవాల్సి ఉంటుంది. సుప్రీం తీర్పుపై కూటమి ప్రభుత్వం స్పందించి టీచర్లకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని వారంతా ఎదురు చూస్తున్నారు. అయితే సుప్రీం కోర్టు తీర్పు వెలువడి నెల దాటినా కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు.

ప్రభుత్వానిదే బాధ్యత



సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు 'టెట్' నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి. దీనిపై ఉపాధ్యాయుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. విద్యాశాఖ మంత్రి లోకేష్ తక్షణం దీనిపై స్పందించాలి.
– వీవీ రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్

అనుభవమే గొప్ప అర్హత



విద్యారంగంలో అనుభవమే గొప్ప అర్హత. సీనియర్ టీచర్ల బోధనా నైపుణ్యాలను 'టెట్' పరీక్షతో కొలవలేం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే దీనిపై పునఃసమీక్షించాలి. సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలి.
– హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్టీయూ

పునరాలోచన చేయాలి



సుప్రీంకోర్టు తీర్పు ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారింది. ఉపాధ్యాయ నియామకాలు జరిగినప్పుడు లేని నిబంధన.. ఇప్పుడు పెట్టడం సరి కాదు. కూటమి ప్రభుత్వం వెంటనే దీనిపై తన నిర్ణయాన్ని ప్రకటించాలి.
– కాదిశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్

ప్రభుత్వాలు చొరవ చూపాలి



రెండేళ్లలో టీచర్లు 'టెట్' ఉత్తీర్ణత సాధించాలన్న సుప్రీంకోర్టు నిర్ణయం విద్యా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఏళ్లుగా పాఠాలు బోధిస్తున్నారు. వయసు, ఆరోగ్య సమస్యలు, ఇంటి బాధ్యతలు, ఇలాంటి తరుణంలో టెట్‌కు ప్రిపేర్ కావాలంటే కష్టం. దీనిపై ప్రభుత్వం వెంటనే చొరవ చూపి తగు న్యాయం చేయాలి.
– జయచంద్రారెడ్డి, యూటీఎఫ్ నేత

సుప్రీం తీర్పు వర్తిస్తుంది



తమిళనాడుకు సంబంధించిన ఓ కేసులో సుప్రీం కోర్టు 'టెట్'పై కీలక తీర్పునిచ్చింది. అది మనకూ వర్తిస్తుంది. ఉద్యోగంలో కొనసాగాలన్నా.. పదోన్నతి పొందాలన్నా 'టెట్' ఉత్తీర్ణత తప్పనిసరి అని తీర్పులో స్పష్టంగా ఉంది. ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్నవారికి మినహాయింపునిచ్చారు.
–కిష్టప్ప, జిల్లా విద్యాశాఖాధికారి

వైద్యుల వినూత్న నిరసన



మోకాళ్లపై కూర్చుని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న వైద్యులు

- నాలుగో రోజు మోకాళ్లపై కూర్చుని ఆందోళన

పుట్టపర్తి అర్బన్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మెబాట పట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు నాలుగోరోజు శుక్రవారం వినూత్న నిరసన తెలిపారు. స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద దీక్షా శిబిరం వద్ద పలువురు వైద్యులు మోకాళ్లపై కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు. గత సెప్టెంబర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. చంద్రన్న సంచార చికిత్సల్లో పాల్గొన్న వారికి రూ. 5 వేల ప్రోత్సాహకం, పీజీ ఇన్ సర్వీస్ కోటా పునరుద్ధరణ, టైం బౌండ్ ప్రమోషన్లను తక్షణమే పరిష్కరించాలని, గిరిజన ప్రాంతాల్లో పని చేసే వైద్యులకు అలవెన్సులు, 2020లో చేరిన వైద్యులకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం పెద్దలు ఇప్పటికైనా వారితో చర్చలు జరపాలని ప్రజలు కోరుతున్నారు.

బాబా శత జయంతిని వైభవంగా చేద్దాం

- కలెక్టర్ శ్యాం ప్రసాద్ పిలుపు



సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

ప్రశాంతి నిలయం: సమష్టి కృషితో సత్యసాయి శత జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహిద్దామని కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. బాబా శత జయంత్యుత్సవాలకు దేశవిదేశాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సత్యసాయి శత జయంతి వేడుకల ఏర్పాట్ల నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ పుట్టపర్తిలోని కీలక ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత ప్రశాంతి నిలయంలోని గణేష్ గేట్, సాయికుల్వంత్ సభా మందిరం, శాంతిభవన్, వెస్ట్‌గేట్‌లను వారు పరిశీలించారు. ప్రముఖులు, విదేశీ భక్తులు, ప్రజలకు మందిరంలోకి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేకంగా మార్గాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం చిత్రావతి బ్రిడ్జి కూడలి, హారతి ఘాట్, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు వద్ద హెలీప్యాడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. సత్యసాయి ఎయిర్‌పోర్ట్‌ను సందర్శించి ప్రముఖులు, వీవీఐపీల రాకపోకలకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియం, ప్రైమరీ పాఠశాల, శ్రీనివాస గెస్ట్ హౌస్ తదితర ప్రాంతాలను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పుట్టపర్తి టౌన్: పచ్చని పుట్టపర్తిని ఆవిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో పోలీస్‌పరేడ్ మైదానంలో 'వనం- మనం' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ శ్యాం ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ కోసం జిల్లా అధికారులు, ప్రజలు వారి పరిధిలోని ఖాళీ స్థలంలో మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ప్రస్తుతం 15 లక్షలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన వారు ఆధార్‌కార్డ్ సమర్పించి మొక్కలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పండుగ పూట విషాదం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తండ్రీకుమారుడు సుంకన్న, సుదర్శన్ (ఫైల్)





రోడ్డుపై పడి ఉన్న తండ్రీకొడుకుల మృతదేహాలు, ప్రమాదంలో గాయపడిన కుమార్తె

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారుడి దుర్మరణం
- తీవ్రంగా గాయపడిన ఇద్దరు కుమార్తెలు

ఉరవకొండ/ వజ్రకరూరు: ఆ దంపతులు వారసుడి కోసం ఎన్నో నోములు నోచారు. ఎన్నో గుళ్లు తిరిగారు. ముగ్గురు కుమార్తెల తర్వాత కుమారుడు పుట్టడంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది. అలా సాఫీగా సాగిపోతున్న కుటుంబంలో రోడ్డు ప్రమాదం ఒక కుదుపు కుదిపేసింది. దసరా పండుగకు ఇంటిల్లిపాది కొత్త దుస్తులు ధరించి సంబరంగా ఉన్నారు. తండ్రీ పిల్లలు అమ్మవారి దర్శనం కోసం బయల్దేరారు. 'అమ్మా గుడి నుంచి రాగానే నాకు ఓళిగ చేసి పెట్టాలి' అంటూ కొడుకు చెప్పాడు. అవే కొడుకు చివరి మాటలు అవుతాయని ఆ తల్లి ఊహించలేదు. అరగంటకే రోడ్డు ప్రమాదంలో భర్త, కుమారుడు దుర్మరణం చెందారన్న వార్త ఆమెను కుదిపేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉరవకొండ పట్టణంలో అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన మీనుగ సుంకన్న (43), నాగలక్ష్మి దంపతులు. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు సులోచన, కల్పన, భవానితో పాటు కుమారుడు సుదర్శన్ (10) సంతానం. గురువారం ఉదయం దసరా పండుగను పురస్కరించుకుని అమ్మవారి దర్శనం కోసం వజ్రకరూరు మండలం కడమలకుంటకు ద్విచక్ర వాహనంపై ఉరవకొండ నుంచి తన కుమారుడు సుదర్శన్, కుమార్తెలు కల్పన, భవానితో కలిసి సుంకన్న బయల్దేరాడు. భార్య నాగలక్ష్మి, పెద్ద కుమార్తె సులోచన ఇంటివద్దే ఉన్నారు. పిల్లలతో కలిసి వెళ్తుండగా ద్విచక్రవాహనాన్ని మార్గమధ్యంలో పీసీ ప్యాపిలి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుంకన్న, కుమారుడు సుదర్శన్ అక్కడికక్కడే మరణించారు. ఇద్దరు కుమార్తెలు తీవ్రంగా గాయపడ్డారు. అటువైపు వెళుతున్న వాహనదారులు గమనించి వెంటనే వజ్రకరూరు పోలీసులకు సమాచారం అందించారు. విషయం కుటుంబ సభ్యులు, బంధువులకు తెలియడంతో ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. దేవుడా ఎంత పనిచేశావయ్యా అంటూ సుంకన్న భార్య గుండెలవిసేలా రోదించిన తీరు అందరినీ కలచివేసింది. గాయపడిన కుమార్తెలను ఉరవకొండ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మార్చురీకి తరలించారు. సుంకన్న భార్య ఫిర్యాదు మేరకు వజ్రకరూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న రుత్వికులు (ఇన్‌సెట్) పూర్ణాహుతితో యజ్ఞం ముగిస్తున్న పండితులు



సంగీత విభావరి నిర్వహిస్తున్న స్ఫూర్తి రావు బృందం

ప్రశాంతి నిలయం: దసరాను పురస్కరించుకుని విశ్వశాంతిని కాంక్షిస్తూ సత్యసాయి సన్నిధిలో చేపట్టిన వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం గురువారం పూర్ణాహుతితో ముగిసింది. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత యజ్ఞ వస్తువులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ర్యాలీగా పూర్ణచంద్ర ఆడిటోరియానికి వెళ్లి అక్కడ పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. పూర్ణాహుతి ముగిసిన తర్వాత వేదపండితులు యజ్ఞ జలాన్ని భక్తులపై చల్లి ఆశీస్సులు అందజేశారు.

పరవశించిన భక్తజనం

దసరా వేడుకల్లో భాగంగా గురువారం పూర్ణచంద్ర ఆడిటోరియంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు స్ఫూర్తి రావు బృందం సభ్యులు సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ వారు ఆలపించిన గీతాలతో భక్తజనం పరవశించారు. చక్కటి భక్తి గీతాలతో నిర్వహించిన సంగీత కచేరీతో మైమరచిపోయారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కలెక్టర్ శ్యాం ప్రసాద్ దసరా వేడుకల్లో పాల్గొని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకలు ముగిసిన అనంతరం ప్రశాంతి నిలయం నార్త్ బిల్డింగ్స్ వద్ద గల నిత్యాన్నదాన మందిరంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ రాజు అన్న ప్రసాద వితరణ చేశారు.



అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు

ఉపాధి అక్రమాలకు చెక్!

- కొత్త మార్గదర్శకాలను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం
- 15 నుంచి జిల్లాలో అమలు



ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు

అనంతపురం టౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా నూతన మార్గదర్శకాలను ప్రవేశపెడుతోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు నూతన సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో పనుల్లో పాలు పంచుకుంటేనే ఉపాధి వేతనం అందుతుంది. లేకపోతే లేదు.

గతంలో నకిలీ ఫొటోలతో దోపిడీ

గతంలో ఉపాధి హామీ పథకం నిధులను అడ్డగోలుగా దోచేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శించి జాబ్‌కార్డు ఉంటే చాలు ఉపాధి పనులకు రాకున్న వచ్చినట్లు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేసి వేతనాల రూపంలో రూ.కోట్లు కొల్లగొట్టేశారు. బుక్కరాయసముద్రం మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో 2వేలమంది ఉపాధి కూలీలు ఉంటే రోజు వారీగా 1,900 మందికి పైగా పనులకు హాజరైనట్లు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేశారంటే దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామం మొత్తం ఉపాధి పనులకు హాజరవడంపై జిల్లా అధికార యంత్రాంగమే విస్తుపోయింది. క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలిస్తే కేవలం 200మంది మాత్రమే కనిపించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు 20 రోజుల వేతనాలను నిలుపుదల చేశారు. జిల్లాలోని 32 మండలాల్లో ఇదే తంతు కొనసాగినట్లుగా అప్పట్లో అధికారులు గుర్తించారు.

ప్రతి సోమవారం వేతనాలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6.86 లక్షల జాబ్‌కార్డులు, 11.58 లక్షల మంది శ్రామికులు ఉన్నారు. వీరిలో అనంతపురం జిల్లాలో 3.16లక్షల జాబ్‌కార్డులు, 5.38 లక్షల మంది శ్రామికులు, శ్రీసత్యసాయి జిల్లాలో 3.70 లక్షల జాబ్ కార్డులు, 6.20 మంది శ్రామికులు ఉన్నారు. వీరందరి జాబ్‌కార్డులను ఆధార్ నంబర్లతో అనుసంధానం చేయనున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 80 శాతానికి పైగా అనుసంధాన ప్రక్రియను పూర్తి చేశారు. పనులకు హాజరయ్యే శ్రామికులకు ఈ-కేవైసీని తప్పనిసరి చేయడంతో కష్టించిన వారికి మాత్రమే ఉపాధి నిధులు వేతన రూపంలో వారి ఖాతాల్లో జమ కానున్నాయి. వారంలో ఎన్ని రోజులు పని చేసినా.. పని చేసిన రోజులకు సంబంధించి ప్రతి సోమవారం వేతనాలు వారి ఖాతాల్లోనే నేరుగా జమ చేయనున్నారు. ప్రతి రోజూ రెండు పర్యాయాలు పనులకు హాజరైన ఫొటో, పనులు ముగించిన అనంతరం మరో ఫొటో అధారిత హాజరు నమోదు చేయనున్నారు.

ఈ నెల 15 నుంచి అమలు



ఉపాధి హామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌ను మరింతగా అభివృద్ధి చేసి జాబ్ కార్డులో ఉన్న శ్రామికుల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయనున్నాం. పనులకు హాజరయ్యే శ్రామికులకు ఈ-కేవైసీ తప్పనిసరి చేశాం. ఇప్పటికే జిల్లాలో 80శాతానికి పైగా శ్రామికుల వివరాలను అనుసంధానం చేశాం. మిగిలిన 20 శాతాన్ని ఈ నెల 10వ తేదీ లోపు పూర్తి చేసి 15 నుంచి జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– సలీంబాషా, డ్వామా పీడీ, అనంతపురం

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

- సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ హెచ్చరిక



పోస్టర్లు విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు

పుట్టపర్తి: తమ సమస్యలు పరిష్కరించకుంటే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా జేఏసీ అధ్యక్షుడు ఓబిరెడ్డి హెచ్చరించారు. ఈ నెల 12న విజయవాడలో తలపెట్టిన దశాబ్ద ఐక్యత భవిష్యత్తు పోరాట సభ పోస్టర్లను శుక్రవారం కొత్తచెరువు మండల రీసోర్స్ కార్యాలయ ఆవరణలో ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. గత 20 ఏళ్లుగా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖలో ఎంతో ప్రాధాన్యత ఉన్న సమగ్ర శిక్షలో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వరప్రసాద్, భాస్కర్, శ్రీలత, హేమలత, రామమోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: బాలికను వేధింపులకు గురిచేయడమే కాక ఆమె తల్లిపై దాడి చేసినందుకు ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. ధర్మవరం మున్సిపాల్టీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులు 16 సంవత్సరాలుగా బెంగళూరులో నివసిస్తున్నారు. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన ఈశ్వర్ అనే యువకుడు గత రెండేళ్లుగా బాలికను ప్రేమిస్తున్నానంటూ వెంటపడేవాడు. బుధవారం రాత్రి బాలిక చెయ్యి పట్టుకుని తన కోరిక తీర్చాలంటూ బెదిరింపులకు దిగాడు. విషయాన్ని బాలిక ద్వారా తెలుసుకున్న తల్లి నేరుగా వెళ్లి ఈశ్వర్‌ను నిలదీయడంతో అతను చెయ్యి చేసుకున్నాడు. దీంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా.. వృద్ధుడి మృతి



మృతుడు పెద్దన్న

కనగానపల్లి: మండలంలోని చంద్రాచెర్ల సమీపంలో ఆటో బోల్తా పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... గురువారం సాయంత్రం మామిళ్లపల్లి నుంచి చంద్రాచెర్లకు వెళ్తున్న ఆటో 44వ జాతీయ రహదారి దాటిన తర్వాత మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న చంద్రాచెర్లకు చెందిన పెద్దన్న (80) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడటంతో వారిని ధర్మవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రామీణులే లక్ష్యంగా సైబర్ వల

చిలమత్తూరు: గ్రామీణులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు వల విసిరారు. యూపీఐ ద్వారా నగదు బదలాయిస్తున్నట్లుగా నమ్మబలికి అందిన కాడికి దోచుకుని ఉడాయిస్తున్నారు. తాజాగా చిలమత్తూరు, టేకులోడు పంచాయతీల పరిధిలో ఇలాంటి కేసులు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. దాదాపు 15 నుంచి 20 మంది ఖాతాలలో నగదు ఫ్రీజ్ కావడంతో ఖాతాదారులు బెంబేలెత్తిపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తి.. తనతో క్యాష్ లేదని, ఆన్‌లైన్ ద్వారా నగదు బదలాయిస్తా.. తనకు నగదు ఇవ్వాలని అడగడంతో రైతులు అంగీకరించారు. దీంతో వారి ఖాతాలకు నగదు బదిలీ అయినట్లుగా చూపించి ఒక్కొక్కరితో రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకూ నగదు తీసుకుని ఉడాయించాడు. బ్యాంక్ ఖాతాలో నగదు ఉన్నా తీసుకునే అవకాశం లేకపోవడంతో రైతులు నేరుగా వెళ్లి బ్యాంక్ అధికారులను సంప్రదించారు. దీంతో జరిగిన మోసం కాస్త బట్టబయలైంది. కాగా, టేకులోడు రెవెన్యూ పరిధిలో సెజ్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో రైతులకు ఏపీఐఐసీ నుంచి నగదు జమ అవుతోంది. దీంతో తమ ఖాతాల నుంచి నగదు ఖాళీ అవుతుందేమోననే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. దీనిపై స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులతో ఆన్‌లైన్ ద్వారా నగదు లావాదేవీలు చేయడంతో 15 నుంచి 20 మంది ఖాతాలను ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. ఈ విషయంగా గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు

బత్తలపల్లి: మొక్కు చెల్లించుకుని తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుని ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. బత్తలపల్లి మండలం లింగారెడ్డిపల్లికి చెందిన మైకు కాటమయ్య శుక్రవారం తన కుటుంబ సభ్యులతో కలిసి మొక్కుబడి తీర్చుకునేందుకు కొలతలకొండ అక్కమాంబ ఆలయానికి ఆటోలో బయలుదేరి వెళ్లారు. అక్కడ పూజాదికాలు ముగించుకున్న అనంతరం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. పులివెందుల సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బాలుడు చందు, సావిత్రి, పెద్దన్న, లక్ష్మీనారాయణ, నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. మరి కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులందరూ పులివెందులలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స పొంది, అనంతరం బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రిలో చేరారు. చందుకు తలలో తీవ్రగాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, నాయకులు బొంతల ప్రతాప్, బొంతల రాఘవ, రఘు, పుల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణమనాయుడు తదితరులు ఆర్డీటీ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నిక సమావేశం వాయిదా

పుట్టపర్తి టౌన్/ప్రశాంతి నిలయం: రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) జిల్లా శాఖ కమిటీ ఎన్నిక కోసం ఈ నెల 4న నిర్వహిస్తున్న సమావేశాన్ని వాయిదా వేసినట్లు జిల్లా కో–ఆపరేటివ్ అధికారి కృష్ణానాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశం నిర్వహించే తేదీ తదుపరి ఖరారు చేయనున్నట్లుగా పేర్కొన్నారు.

గొంతు కోసుకుని.. ఆస్పత్రి నుంచి పరుగు తీసి!

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- జీజీహెచ్‌లో సర్జరీ అయిన తర్వాత సెక్యూరిటీ, తదితరులపై దాడి



ఉరవకొండ ఆస్పత్రి నుంచి పారిపోతున్న శేఖర్‌ను పట్టుకెళ్తున్న పోలీసులు

ఉరవకొండ/అనంతపురం కార్పొరేషన్: క్షణికావేశంలో పొలాల్లో గొంతు కోసుకున్న ఓ యువకుడిని ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందిస్తుండగా తప్పించుకుని పారిపోయాడు. అతికష్టంపై పోలీసులు వెంటాడి పట్టుకుని మళ్లీ ఆస్పత్రికి చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం జీజీహెచ్‌లో చేర్పిస్తే అక్కడా తనదైన శైలిలో రెచ్చిపోయి సిబ్బందిపై దాడికి తెగబడ్డాడు. వివరాల్లోకి వెళితే... ఉరవకొండలోని హమాలీ కాలనీకి చెందిన శేఖర్‌కు వివాహమైంది. పిల్లలు లేరు. కుటుంబ కలహాలతో విసుగు చెందిన శేఖర్ క్షణికావేశానికి లోనై గురువారం బూదగవి గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లి కత్తితో గొంతు కోసుకున్నాడు. అటుగా వెళుతున్న రైతుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేస్తుండగా ఒక్కసారిగా అందరినీ తోసేసి రోడ్డుపైకి పరుగు తీశాడు. సీఐ మహనందితో పాటు సిబ్బంది వెంటపడి పరుగు తీసినా చేతికి చిక్కకుండా తప్పించుకోని పారిపోతుండగా స్థానికులు అతి కష్టంపై అడ్డుకుని నిలువరించారు. వెంటనే శేఖర్‌ను పట్టుకుని పోలీసులు ఆస్పత్రికి చేర్చి, దగ్గరుండి చికిత్స చేయించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని జీజీహెచ్‌కి తరలించారు.

జీజీమెచ్‌లో హల్‌చల్

గురువారం రాత్రి 8 గంటల సమయంలో శేఖర్‌ను జీజీహెచ్‌కు పోలీసులు, కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. అయితే చికిత్స చేయించుకునేందుకు నిరాకరిస్తూ క్యాజువాలిటీలోని టేబుళ్లపైకి ఎక్కి కేకలు వేస్తూ హల్‌చల్ చేశాడు. చివరకు ఈఎన్‌టీ వైద్యురాలు డాక్టర్ మధులిక, తదితరులు శేఖర్‌కు మత్తు ఇంజక్షన్ ఇచ్చి, మెయిన్ ఆపరేషన్ థియేటర్‌కు తరలించి శస్త్రచికిత్స చేసి, ఈఎన్‌టీ వార్డుకు తరలించారు. కాసేపటికి తేరుకున్న శేఖర్ అక్కడున్న సెక్యూరిటీ, అటెండర్‌పై కర్రతో దాడి చేశాడు. శుక్రవారం ఉదయం శేఖర్‌ను మెరుగైన వైద్యం కోసం కడప ఆస్పత్రికి తరలించారు.

రామగిరిలో టీడీపీ నేత అరాచకం

- పొలంలో గొర్రెలు మేపావంటూ కాపరిపై దాడి
- ఇరువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు



దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ శివన్న

రామగిరి: మండలంలోని గరిమేకలపల్లిలో ఓ టీడీపీ నేత అరాచకానికి తెరలేపాడు. తన పొలంలో గొర్రెలు మేశాయంటూ కాపరిపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డాడు. వివరాలు.. గరిమేకలపల్లికి చెందిన కురుబ శివన్న తనకున్న గొర్రెలను రోజు వారీ కార్యక్రమంలో భాగంగా గురువారం మేపునకు తోలుకెళ్లాడు. అయితే స్థానిక టీడీపీ నేత రమేష్ తన పొలం పక్కగా వెళుతున్న గొర్రెలను గమనించి కురుబ శివన్నను అడ్డుకున్నాడు. తన పొలంలో మేపునకు వదిలావంటూ గొడవకు దిగి దాడికి పాల్పడ్డాడు. అక్కడితో ఆగకుండా కురుబ శివన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త కావడంతో సాయంత్రం శివన్న ఇంటికి కుటుంబసభ్యులతో చేరుకుని బెదిరింపులకు దిగాడు. ఈ విషయంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే విచారణకు హాజరైన రమేష్ కూడా ప్రతిగా ఫిర్యాదు చేయడంతో ఇరువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

లేపాక్షి: మండలంలోని పులమతి సమీపంలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.10,300 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ తెలిపారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం తనిఖీలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ సమయంలో పోలీసుల రాకను గమనించిన పలువురు అక్కడి నుంచి పారిపోగా 8 మంది పట్టుబడ్డారన్నారు. జూదరులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

నిందితుడి అరెస్ట్

పెనుకొండ: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో దిలీప్‌నాయక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పెనుకొండ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. శెట్టిపల్లికి చెందిన దిలీప్‌నాయక్ అదే గ్రామానికి చెందిన ఓ మహిళపై ఈ నెల 1న అసభ్యంగా ప్రవర్తించాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కల్లూరులో నివాసముంటున్న రాము (37)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిస కావడంతో రెండేళ్ల క్రితం పిల్లలను పిలుచుకుని భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తల్లి ఓబుళమ్మతో కలసి ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం రాము ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గమనించిన తల్లి వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో కాపాడి పామిడిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లింది. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని జీజీహెచ్‌కు వైద్యులు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి రాము మృతి చెందాడు. కాగా, రాము మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఆ దిశగా తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బొలెరో ఢీ - వ్యక్తి దుర్మరణం



మృతుడు హనుమంతరాయప్ప

అమరాపురం: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... అమరాపురం మండలం కాచికుంట గ్రామానికి చెందిన రైతు దాసప్ప గారి హనుమంతరాయప్ప (55) శుక్రవారం ఉదయం జేసీబీ సాయంతో తన పొలంలో పనులు చేయిస్తున్నాడు. మధ్యాహ్నం పనులు చేస్తున్న డ్రైవర్, తదితరులకు భోజనం తీసుకువచ్చేందుకు అమరాపురం గ్రామానికి వచ్చాడు. ఓ హోటల్‌లో భోజనం పార్సిల్ తీసుకుని తిరుగు ప్రయాణమైన ఆయన ఉదుగూరు గ్రామం వద్దకు చేరుకోగానే హేమావతి వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో ఢీకొంది. దీంతో హనుమంతరాయప్పబైక్‌పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ తన వాహనంతో పాటు ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పొలాల్లో కేబుల్ అపహరణ

పుట్టపర్తి అర్బన్: మండలంలోని మూడు గ్రామాల్లో సుమారు 25 మంది రైతులకు చెందిన వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్‌ను దుండగులు అపహరించుకెళ్లారు. జగరాజుపల్లి, వెంకటగారిపల్లి, కొత్తచెరువు మండలం గొనికుంటపల్లి గ్రామాల్లో దసరా పండుగ రోజు, అంతకు ముందు రోజు 25 బోరు బావుల వద్ద కేబుల వైరు, స్టార్టర్లు, ఇతర మోటర్ పరికరాలు అపహరణకు గురయ్యాయి. కొత్తచెరువు రైతుల ఫిర్యాదు మేరకు ఓ అనుమానితుడిని సీఐ మారుతీ శంకర్ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. అయితే సదరు వ్యక్తి టీడీపీ కార్యకర్త కావడంతో కేసు నమోదులో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దండి

- కొత్త టీచర్ల శిక్షణ తరగతుల ప్రారంభంలో డీఈఓ క్రిష్టప్ప



మాట్లాడుతున్న డీఈఓ క్రిష్టప్ప

హిందూపురం టౌన్: అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కొత్త టీచర్లకు జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప సూచించారు. డీఎస్సీ–25కు ఎంపికైన టీచర్లకు శుక్రవారం హిందూపురంలోని బీఐటీ కళాశాలలో శిక్షణ ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఈఓ మాట్లాడుతూ... గతాన్ని మరిచిపోకుండా లభించిన అవకాశాన్ని చిత్తశుద్ధితో ఉపయోగించుకుంటే ఏ వృత్తిలోనైనా రాణించగలుగుతారన్నారు. సమాజంలో ఎంతో గౌరవమైన ఉపాధ్యాయ వృత్తిని సాధించడం గొప్ప విషయమన్నారు. పట్టణ, మారుమూల ప్రాంతాల్లో అవకాశం వచ్చినా అంకితభావంతో సేవలను అందించాలన్నారు. సీఎంఓ మాలిక్, మండల విద్యాశాఖాధికారులు గంగప్ప, ప్రసన్నలక్ష్మి, శేషాచలం మాట్లాడుతూ... విద్యార్థులతో మమేకం అవుతూనే తల్లిదండ్రులు, ప్రజల సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీజీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర కుమార్, స్టేట్ రిసోర్స్ పర్సన్ బాబా, బాలాజీ నాయక్, నర్సిరెడ్డి, శేఖర్ బాబు, రామాంజినేయులు, ఆర్గనైజర్లు శ్రీనివాసరెడ్డి, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై 22 మంది టీచర్ల రాక

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా జిల్లాకు 22 మంది వచ్చారు. శుక్రవారం సాయంత్రం డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి స్కూళ్లు కేటాయించారు. బదిలీల్లో జిల్లాకు వచ్చిన వారిలో హెచ్‌ఎంలు ఇద్దరు, పీఎస్‌హెచ్‌ఎంలు ఇద్దరు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఒకరు, స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఒకరు, గణితం ముగ్గురు, పీఎస్ ముగ్గురు, బీఎస్ ఒకరు, ఇంగ్లీష్ ఒకరు, పీఈటీ ఒకరు, ఎస్జీటీలు ఏడుగురు ఉన్నారు. కాగా 3, 4 కేటగిరీలకు సంబంధించి కొన్ని స్కూళ్లు మాత్రమే ఖాళీలు చూపడంపై యూటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. ఆయా కేటగిరీల్లో అన్ని ఖాళీలను చూపించాలని డిమాండ్ చేశారు.



ప్రత్యేక అలంకరణలో త్రిశక్తి అమ్మాజీ దేవతలు



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కనుల పండువగా జాతర

రొళ్ల: మండలంలోని జీరిగేపల్లిలో వెలసిన త్రిశక్తి అమ్మాజీ దేవతల జాతర శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. ఉత్సవానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. వేకువజామునే ఆలయంలో మారక్క, గ్యారక్క, ముడుపక్క, కంబదముత్తక్క దేవత మూర్తుల మూల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించి వెండి, బంగారు ఆభరణాలతో పాటు భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలతో అలంకరించారు. ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో పాలబావి వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి గంగా జలంతో అభిషేకించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ఊయాల స్తంభం వద్ద పట్టంపై కూర్చో బెట్టారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దాతల సహకారంతో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో అమ్మాజీ ధర్మ ప్రచార సేవ పరిషత్ ట్రస్ట్ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.